ఇక జనంలోకి కెసిఆర్

- చిట్‌చాట్‌లో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్‌కు ఇచ్చిన గడువు ముగిసిందనీ, ఇక జనంలోకి కెసిఆర్ వస్తారనీ, పోరాటం చేస్తారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కెటిఆర్) అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎవరితోనైనా ఫుట్‌బాల్ ఆడుకోవచ్చు కానీ, ఆయనతో ప్రజలు 'ఫుట్‌బాల్' ఆడుకోవడం ఖాయమని అన్నారు. ఆయన మాదిరిగా కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగడం తమ సంస్కృతి కాదనీ, అది కెసిఆర్ తమకు నేర్పలేదని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని నమ్మించి, తీరా పంచాయతీ ఎన్నికల సమయంలో వాటిని 17 శాతానికి తగ్గించి కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో బిజెపి నేతలతో సిఎం రేవంత్‌రెడ్డికి లోపాయికారీ ఒప్పందాలున్నాయని చెప్పారు. కాంగ్రెస్‌కు తెలంగాణ 'ఏటీఎం'గా మారిందని ఆరోపించారు. దమ్ముంటే పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలని రేవంత్‌రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కుంటుపడి కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పథకాల పేర్లు మార్చడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని విమర్శించారు. హైదరాబాద్ నగరాన్ని మూడు ముక్కలు చేయాలనే రేవంత్‌రెడ్డి ఆలోచన అశాస్త్రీయమనీ, వార్డుల విభజన ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా జరుగుతోందని అన్నారు. ఉపాధి హామీ చట్టానికి చేసిన సవరణల వల్ల గ్రామీణ పేదలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఆ చట్టానికి మహాత్మాగాంధీ పేరును తీసేయడాన్ని తప్పుపట్టారు. ఆ చట్టానికి తూట్లు పొడిచేలా నిబంధనలను మార్చిందనీ, కేంద్రం తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి 'హనీమూన్ పీరియడ్' ముగిసిందనీ, ఇక కెసిఆర్ నేరుగా ప్రజల్లోకి వస్తారని కెటిఆర్ ప్రకటించారు. ఆదివారం జరిగే రాష్ట్ర స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత భారీ ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. 2028లో బిఆర్‌ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు.

ఇతర మతాలను కించపరిస్తే శిక్షిస్తాం

- ఆ మేరకు చట్టాన్ని సవరిస్తాం : సిఎం
- ఎల్‌బి స్టేడియంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అన్ని మతాలను గౌరవిస్తూ.. అన్ని మతాల వారికి సమాన అవకాశాలను కల్పించటమే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఎవరి మతాన్ని వారు ఆచరిస్తూనే ఇతర మతాలను గౌరవించాలని ఆయన సూచించారు. అంతే తప్ప ఇతర మతాలను కించపరిస్తే చూస్తూ ఊరుకోబోమని వ్యాఖ్యానించారు. అలాంటి వారిని కఠినంగా శిక్షిస్తామని, ఆ మేరకు చట్టాన్ని సవరిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో మంత్రులు అజహరుద్దీన్, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం ప్రసంగిస్తూ... రాష్ట్రంలో మత ప్రాతిపదికన దాడులు చేసేందుకు ప్రయత్నించిన వారిని తమ ప్రభుత్వం అణచివేసిందని గుర్తు చేశారు. మైనారిటీలకు అందించే సంక్షేమం ఎవరి దయా కాదని, అది వారి హక్కని తెలిపారు. క్రిస్టియన్, ముస్లిం స్మశాన వాటికల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ యేడాది కూడా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి.. ప్రేమను పంచాలి, శాంతిని పెంచాలనే సూక్తిని ఏసుక్రీస్తు ప్రపంచమొత్తం ప్రచారం చేశారని కొనియాడారు. ద్వేషించే వారిని సైతం ప్రేమించాలంటూ ఆయన మానవాళికి సందేశమిచ్చారని తెలిపారు. జీసస్ జన్మించిన డిసెంబర్ నెల మిరాకిల్ మంత్ (అద్భుతమైన నెల) అంటూ అభివర్ణించారు. ఈ నెల క్రీస్తు ఆరాధకులకు మాత్రమే కాదు.. తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి కూడా మిరాకిల్ మంతేనని చెప్పారు. పార్టీ అధినేత్రి, తెలంగాణ ప్రదాత సోనియా గాంధీ పుట్టింది డిసెంబర్ నెలలోనేనని, రాష్ట్రంలో తమ ప్రజా ప్రభుత్వం ఏర్పడింది కూడా ఈనెలలోనేనని ఆయన గుర్తు చేశారు. అందుకే ప్రభువు బోధనల స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

ఎవరెన్ని విధాలుగా ఇబ్బంది పెట్టినా, తమపై ఎంత దుష్ప్రచారం చేసినా.. ఓర్పు, పట్టుదలతో శాంతిని కాపాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని, అందులోని అంశాలను అమలు చేయటం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలబడతామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వేడుకలకు విచ్చేసిన చిన్నారులకు సిఎం క్రిస్మస్ బహుమతులను అందజేశారు.

కోకాకోలా 'లోకల్లీ యువర్స్' ప్రచారం

హైదరాబాద్: శీతల పానీయాల బహుళజాతి సంస్థ కోకా కోలా ఇండియా తన బాట్లింగ్ భాగస్వామి అయిన హిందుస్థాన్ కోకా కోలా బేవరేజెస్‌తో కలిసి 'లోకల్లీ యువర్స్' ప్రచారం ప్రారంభించినట్లు తెలిపింది. ఇందులో తెలంగాణలోని కిరాణా దుకాణాలు, దాబాలు, పరిసర ప్రాంతాలను, హైవేలను అనుసంధానించే చిన్న వ్యాపారాల రోజువారీ సేవలను హైలైట్ చేస్తోన్నట్లు ఆ కంపెనీ ప్రతినిధి కరణ్ అచ్వాల్ పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో 11 స్టోర్లకు సోచ్ విస్తరణ

హైదరాబాద్ : ప్రముఖ ఫ్యాషన్ రిటైల్ బ్రాండ్ సోచ్ హైదరాబాద్‌లో తన 11వ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. లేక్‌షోర్ మాల్‌లో 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన స్టోర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. భారతీయ ఎత్నిక్ వేర్ మార్కెట్‌లో 20 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సోచ్ ప్రస్తుతం 65కు పైగా నగరాల్లో 175 కంటే ఎక్కువ ఎక్స్‌క్లూజివ్ స్టోర్లను నిర్వహిస్తోందని తెలిపింది.

చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి

- స్వాతంత్రోద్యమంలో దాని పాత్రే లేదు
- "సిపిఐ వందేళ్ల స్ఫూర్తి సభ"లో పల్లా వెంకటరెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ రాజకీయ లబ్ది కోసం చరిత్రను బిజెపి వక్రీకరిస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని నారాయణ గూడ మార్వెన్ ఫంక్షన్ హాల్లో సిపిఐ వందేండ్ల ఉత్సవాల సందర్భంగా సిపిఐ త్యాగాల, విజయాల స్ఫూర్తి సభ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను పల్లా వెంకట రెడ్డి ఆవిష్కరించి అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్వాతంత్రోద్యమంలోనూ, హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనం సందర్భంగా జరిగిన పోరాటాల్లోనూ బిజెపి ఎక్కడున్నదని ప్రశ్నించారు. ఆ పోరాటాల్లో కమ్యూనిస్టు పార్టీకి గణనీయమైన చరిత్ర ఉన్నదని వివరించారు. కమ్యూనిస్టు పార్టీ లేకపోతే తమకు ఎదురు ఉండదనే ఉద్దేశంతోనే మోడీ ప్రభుత్వం పోరాట, ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్‌కు చెందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ వల్లనే హైదరాబాద్ విలీనమైందని చెప్పటం సిగ్గుచేటని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారనీ, అప్పటికే పది లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులు ప్రజలకు పంపిణీ చేశారని గుర్తు చేశారు. దీంతో హైదరాబాద్ కమ్యూనిస్టుల వశమౌతుందనే భయంతోనే హైదరాబాద్ విలీనానికి ఒప్పందం జరిగిందని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా నాటి ప్రభుత్వం బ్యాంకులను జాతీయకరణ చేస్తే..మోడీ ప్రభుత్వం లాభాల్లో ఉన్న ప్రభుత్వం రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జనవరి 18న ఖమ్మంలో జరగబోయే సిపిఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈటీ నర్సింహా మాట్లాడుతూ.. చరిత్రలో బిజెపికి, ఎంఐఎంకు స్థానమే లేదని విమర్శించారు. ప్రధాని మోడీ అబద్ధాలను ప్రచారం చేస్తే.. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దేశం మొత్తం తిరిగి విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో మోడీని 60 లక్షల మంది తిరస్కరించారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహా, వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, ఎ.రవీంద్ర చారి, సీనియర్ నాయకులు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.ప్రేమ్ పావని, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి నేదునూరి జ్యోతి, నాయకురాలు ఆరుట్ల సుశీల, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఇ.ఉమామహేశ్, హైదరాబాద్ సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భారీ ప్రదర్శన

సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా హిమాయత్‌నగర్ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి నారాయణగూడలోని మార్వేల్ ఫంక్షన్ హాల్ వరకు ఎర్రజెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

పది రోజుల్లో అక్రిడిటేషన్లు

- కొత్త సంవత్సరం ఇంటి జాగాలపై తీపి కబురు
- టిడబ్ల్యుజెఎఫ్ ఖమ్మం మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఫెడరేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులుగా ఖదీర్, శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ మరో పదిరోజుల్లో ప్రారంభిస్తామని రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పిఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం చివరికి అక్రిడిటేషన్ల ప్రక్రియ, వచ్చే ఏడాది జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కేటాయింపుపై తీపి కబురు చెబుతామని స్పష్టం చేశారు. ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) జిల్లా మహాసభను ఉద్దేశించి ఆయన ఫోన్‌లో మాట్లాడారు. మహాసభకు హాజరయ్యేందుకు బయలుదేరిన మంత్రికి సిఎం కార్యాలయం నుంచి ఆకస్మిక పిలుపు రావడంతో హైదరాబాద్ వెళ్లారు. అనివార్య కారణాల వల్ల రాలేకపోతున్నందుకు మన్నించాలని జర్నలిస్టులను కోరిన మంత్రి.. తన సందేశాన్ని ఫోన్ ద్వారా వినిపించారు. అక్రిడిటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. అక్రిడిటేషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని, పది రోజుల్లో దీనికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. అందువల్ల ప్రత్యామ్నాయ పద్ధతుల్లో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొత్త సంవత్సరం ఆరంభంలో ఇండ్ల స్థలాల విషయమై తీపి కబురు అందిస్తామని చెప్పారు. టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ ఘనంగా నిర్వహించుకోవడం పట్ల సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకత్వానికి మంత్రి అభినందనలు తెలిపారు.

జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటాం : సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. తన నియోజకవర్గంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతోపాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానని తెలిపారు.

బీహార్ ముఖ్యమంత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్
- మహిళా డాక్టర్ హిజాబ్‌ను తొలగించడంపై ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముస్లిం మహిళా డాక్టర్ హిజాబ్‌ను తొలగించి అవమానించిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై కఠిన చర్యలు చేపట్టాలని, ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ. పద్మ, వై.వరలక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ముషీరాబాద్ చౌరాస్తాలో ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బేటీ బచావో బేటీ పడావో అని చెప్తున్న బీజేపీ ప్రభుత్వంలోని మంత్రులు, ముఖ్యమంత్రులు దీనికి భిన్నంగా వ్యవహరిస్తూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో బాధిత ముస్లిం డాక్టర్‌కు అండగా నిలవాల్సిన మంత్రుల వ్యాఖ్యానాలు తీవ్ర అభ్యంతరకరమన్నారు. బిజెపి క్యాబినెట్ మంత్రులు సంజయ్ నిషాద్, గిరిరాజ్ వ్యాఖ్యలు వారి మహిళా వ్యతిరేక ఫ్యూడల్ భావజాలాన్ని తెలియజేస్తున్నాయన్నారు. వారిపై వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లావణ్య, రజియా, రామానుజమ్మ, పావని, పద్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మేమెంతో... మాకంత ఇవ్వాలి

హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలో సిపిఎస్ ఉద్యోగులు ఎంతో నిధుల్లో అంత వాటా ఇవ్వాలని టిఎస్‌సిపిఎస్‌ఇయు రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెలకు రూ.700 కోట్ల పెండింగ్ బిల్లుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నదనీ, అందులో సిపిఎస్ ఉద్యోగులకు రూ.వంద కోట్లు చెల్లించలేని స్థితి ప్రభుత్వానికి ఉన్నదా?అని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లో టిఎస్‌సిపిఎస్‌ఇయు ఆధ్వర్యంలో సిపిఎస్ ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం పోరు దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న డిఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని నెరవేర్చాలని కోరారు. సిపిఎస్ విధానంలో ఉద్యోగ విరమణ పొందిన సిపిఎస్ ఉద్యోగికి అన్ని వాయిదాలు చెల్లించిన తర్వాతే మార్కెట్ నుంచి పెన్షన్ కొనుక్కునే దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అటు పాత పెన్షన్ లేక, ఇటు కొత్త పెన్షన్ రాక రిటైర్ అయిన సిపిఎస్ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెన్షన్ లేకుండా కుటుంబాన్ని ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌సిపిఎస్‌ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాం, కోశాధికారి రాఘవేంద్ర, నిస్సార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ గ్రాడ్యుయేట్లకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఉచిత ఉపాధి శిక్షణ

హైదరాబాద్ : కార్పొరేట్ రంగంలో ప్రారంభ స్థాయి అవకాశాలను కోరుకునే కామర్స్, ఫైనాన్స్ గ్రాడ్యుయేట్ల కోసం ఉచితంగా ఉపాధి శిక్షణను అందిస్తున్నట్లు తెలంగాణలోని శ్రీ సత్యసాయి సేవా సంస్థలు తెలిపాయి. గతంలో వంద మందికి పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి డేటా ఇంజనీరింగ్‌లో అవకాశాలను కల్పించిన విషయాన్ని గుర్తు చేసింది. తాజాగా నిరుద్యోగులైన కామర్స్, ఫైనాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ల కోసం శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది. కార్పొరేట్ రంగం లేదా సిఏ సంస్థలలో కెరీర్‌ను ప్రారంభించాలనుకునే ఎంబిఏ (ఫైనాన్స్), ఎం.కామ్ గ్రాడ్యుయేట్లకు అవకాశం కల్పిస్తోన్నట్లు పేర్కొంది. దరఖాస్తుకు చివరి తేదిని డిసెంబర్ 24గా నిర్ణయించింది. శిక్షణ ఖైరతాబాద్‌లో ఉంటుందని తెలిపింది.

2030 నాటికి 50 లక్షల మందికి ఎఐ శిక్షణ : ఐబిఎం వెల్లడి

హైదరాబాద్ : ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం ఐబిఎం 2030 నాటికి భారత్‌లో 50 లక్షల మందికి కృత్రిమ మేధా (ఎఐ), సైబర్ సెక్యూరిటీ, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఐబిఎం స్కిల్స్‌బిల్డ్ ద్వారా ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ శుక్రవారం తెలిపింది. సమానవకాశాలు, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే శ్రామిక శక్తిని నిర్మించడం, అధునాతన డిజిటల్ నైపుణ్యాలను అందరికీ అందుబాటులోకి తేవడం, విద్యార్థులు, అడల్ట్ లెర్నర్స్, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఐబిఎం ఛైర్మన్, సిఇఒ అరవింద్ కృష్ణ తెలిపారు.

విద్వేషంతో భిన్నత్వంలో ఏకత్వం విధ్వంసం

- పుస్తక స్ఫూర్తి కార్యక్రమంలో వసంత కన్నాభిరాన్
- విజ్ఞానాన్ని అందించే ఆయుధం పుస్తకం
- ప్రముఖ సినీ దర్శకులు బి.నర్సింగరావు
- చరిత్రకు సజీవ సాక్ష్యం పుస్తకం : రాంపల్లి రమేష్




ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో రోజు రోజుకు పెరిగి పోతున్న విద్వేషంతో భిన్నత్వంలో ఏకత్వం విధ్వంసం అవుతోందని ప్రముఖ రచయిత వసంత కన్నాభిరాన్ అన్నారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో " పుస్తక స్ఫూర్తి.. పుస్తకం ఒక దారి దీపం" అనే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఒకప్పుడు హైదరాబాద్ నగరంలో ముస్లింలు, హిందువులు, ఆంగ్లో ఇండియన్లు లాంటి అనేక మతాలు, వర్గాల ప్రజలు స్వేచ్ఛగా కలిసి మెలిసి జీవించే వారని గుర్తు చేశారు. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశ సమగ్రతకు ప్రమాదకరమని హెచ్చరించారు. తాము రాసే రచనలపై వచ్చే విమర్శలను సవాలుగా తీసుకుని కలానికి మరింత పదును పెట్టాలని అభిప్రాయపడ్డారు. తనకు సంబంధించి 'కఠోర షడ్జమాల' పుస్తకం విషయంలో జరిగిన అనుభవాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ప్రముఖ సినీ దర్శకులు బి.నర్సింగరావు మాట్లాడుతూ.. పుస్తకం విజ్ఞానాన్ని అందించే ఆయుధమని అన్నారు. ప్రపంచమంతా తిరిగినా, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నా తాను ఏనాడు పుస్తకాన్ని వీడలేదని గుర్తు చేశారు. తన సంపాదనలో ఎక్కువ భాగం పుస్తకాల కోసమే ఖర్చు చేస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని వ్యాపకంగా చేసుకోవాలని సూచించారు. నవతెలంగాణ ఎడిటర్ రాంపల్లి రమేశ్ మాట్లాడుతూ.. విద్వేష భావజాలం మనుషులను విడదీస్తున్న ప్రస్తుత తరుణంలో ఏకం చేసే వారధిగా పుస్తకం తనదైన పాత్రను పోషిస్తోందని అభిప్రాయపడ్డారు. "పుస్తకం చరిత్రకు సాక్ష్యం, వర్తమానానికి కర్తవ్యం, భవిష్యత్‌కు మార్గదర్శకం. అభిప్రాయాలు చెప్పడమే దేశ ద్రోహంగా, ఆలోచనలను అణచి వేస్తున్నారు.75 ఏండ్ల స్వతంత్ర భారతంలో కూడా ఓట్లమ్ముకునే దుస్థితికి కారణమెవరు? ప్రతి రోజూ ట్రిలియన్ డాలర్ల కొలది సంపద సృష్టిస్తున్నా.. నేడు ప్రపంచలో ప్రజలు ఆర్థాకలితో ఎందుకు అలమటిస్తున్నారు? డిజిటల్ సీన్లు, వేగవంతమైన ఫ్లాష్ ఫ్లాష్‌లు ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయి. నేనేంటి? ఎందుకు జరుగుతోంది? కారణమెవరు? ఇలాంటి ఆలోచనలను మస్తిష్కాల్లోకి రాకుండా చేస్తున్నారు. మనుషుల్ని మధ్య యుగాలవైపు తీసుకు పోతున్నారు. సమాజంలోని విద్వేషాలు, విధ్వంసాలు, అన్యాయాలు, అక్రమాలు.. ఏం జరుగుతున్నా ..ప్రశ్నించకుండా ప్రజలను విద్వేషాల ఛట్రంలో బంధిస్తున్నారు. వీటన్నింటిని ఛేదించే ఆయుధమే పుస్తకం. అనంత భావాలను వెదజల్లే విశ్వవిద్యాలయం పుస్తకం. దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన హైదరాబాద్ బుక్ ఫెయిర్ పుస్తక ప్రదర్శనకే పరిమితం కాకుండా...తనదైన శైలిలో సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తోంది. దోపిడీ వ్యవస్థను ప్రశ్నించే మార్క్స్... అసమానతలను ఎండగట్టే అంబేద్కర్...అణచివేతలకు వ్యతిరేకంగా తిరుగుబాటును నూరిపోసే భగత్‌సింగ్ లాంటి మహామహులను ప్రజలకు చేరువ చేసే వేదిక హైదరాబాద్ బుక్ ఫెయిర్. ఇలాంటి మరిన్ని గొప్ప గొప్ప ప్రదర్శనలను ప్రజలకు పరిచయం చేస్తూ మరింతగా ముందుకు సాగాలి" అని రాంపల్లి రమేశ్ ఆకాంక్షించారు. అనంతరం బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకుబ్, ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి వక్తలను సన్మానించారు.

ఎస్ఇఐఎల్‌కు మరోసారి 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' గుర్తింపు

హైదరాబాద్: విద్యుత్ ఉత్పత్తి కంపెనీల్లో ఒక్కటైనా ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు విశిష్ట గుర్తింపు లభించినట్లు ఆ సంస్థ పేర్కొంది. 2025-26 సంవత్సరానికి కూడా ప్రతిష్టాత్మక 'గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికేషన్ పొందడం పట్ల గర్వంగా ఉందని ప్రకటించింది. కంపెనీలో పనిచేసే ఉద్యోగులు కంపెనీ గురించి సర్వేలో వ్యక్తపరిచే అభిప్రాయం ఆధారంగా ఈ ప్రతిష్టాత్మక సర్టిఫికేషన్ లభిస్తుంది. ఈ సంవత్సరం 86 శాతం మంది ఉద్యోగులు ఎస్ఇఐఎల్ ఎనర్జీ పని చేయడానికి గొప్ప ప్రదేశమని అభిప్రాయపడ్డారని ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా సిఇఒ జనమేజయ మహాపాత్ర పేర్కొన్నారు. ఇది ఉద్యోగుల శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే సంస్కృతిని పెంపొందించడానికి తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

స్టార్‌బక్స్ సిటిఒగా ఆనంద్ వరదరాజన్



న్యూఢిల్లీ : కాఫీ రిటైల్ దిగ్గజ సంస్థ స్టార్‌బక్స్ తమ కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ఆనంద్ వరదరాజన్‌ను నియమించుకుంది. వినియోగదారులకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు స్టార్‌బాక్స్‌లో సాంకేతికతను పెంచాలనే సిఇఒ బ్రియాన్ నికోల్ ప్రయత్నాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇంతక్రితం సిటిఒగా పని చేసిన లెఫెవ్రే పదవీవిరమణ చేయడంతో భారత టెకీ వరదరాజన్ ఆ స్థానంలోకి రావడం విశేషం.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంట దిగుబడి రాలేదని మనస్తాపానికి గురైన రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గొల్లగూడ గ్రామం ఈదులవాడ జిపిలో జరిగింది. ఆసిఫాబాద్ సిఐ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలంలోని ఈదులవాడకు చెందిన ఉప్పరి లచ్చయ్య (58) తన ఏడెకరాల చేనులో పత్తి సాగు చేశారు. ఆశించిన మేరకు దిగుబడి రాలేదు. ఆకాల వర్షం, వాతావరణ మార్పుల కారణంగా 40 క్వింటాళ్లు మాత్రమే పంట చేతికొచ్చింది. దీంతో లచ్చయ్య రెండు నెలల నుంచి దిగులుగా ఉన్నారు. ఈనెల 19న సాయంత్రం తన పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుని భార్య ఉప్పరి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ కలెక్టరేట్‌లో నారీ న్యాయ్

హైదరాబాద్ బ్యూరో : రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో నారీ న్యాయ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని మహిళలు ఉద్యోగ, కుటుంబ, గృహహింస, వేధింపులు తదితర సమస్యలను ఎదుర్కొంటున్న వారు నేరుగా కమిషన్ ముందు తమ సమస్యలను తెలపాలని కోరారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇంటర్ బోర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా జగదీశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియెట్ బోర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా వెన్న జగదీశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చల్లా జయనాగ సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలో ఇంటర్మీడియెట్ బోర్డు ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.

జాంబియా నర్సు ప్రాణం నిలిపిన కిమ్స్ వైద్యులు

హైదరాబాద్ : జాంబియా దేశానికి చెందిన 27 ఏళ్ల నర్సును కిమ్స్ హాస్పిటల్ వైద్యులు మృత్యుంజయురాలిగి నిలిపారు. ముంబా మార్గరెట్‌కు అత్యంత ప్రాణాంతకమైన ఎక్యూట్ మైలోయిడ్ లుకేమియా (ఎఎంఎల్) అనే రక్త క్యాన్సర్ ఉంది. 2023 సెప్టెంబర్ నెలలో తొలిసారి ఆమెకు క్యాన్సర్ గుర్తించారు. ఆమెకు అత్యాధునిక చికిత్స అవసరమని, రక్తమూలగ మార్పిడి చేయాలని తెలిపారు. ఎలాగైనా ప్రాణాలు నిలబెట్టుకోవాలన్న తపనతో ఆమె వేల మైళ్లు ప్రయాణం చేసి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి చేరుకున్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. "ముంబా మార్గరెట్‌కు రక్తమూలుగ మార్పిడి చేయడానికి ముందే ఆమెకు టిబి బయటపడింది. చికిత్స సమయంలో లుకేమియా వచ్చింది. దాంతో మళ్లీ కెమోథెరపీ చేయాల్సి వచ్చింది. ఈలోపు పలుమార్లు తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లు వచ్చాయి. ఇలాంటి అనేకానేక సమస్యలతో ముంబా మార్గరెట్ 40 రోజులు ఆస్పత్రిలోనే ఉండి.. అసాధారణమైన ధైర్యంతో తన పోరాటం కొనసాగించారు. అమెకు అత్యంత మెరుగైన వైద్యం, చికిత్స అందించి ప్రాణాలను నిలిపాం. సంపూర్ణంగా కోలుకొని స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు." అని కిమ్స్ ఆస్పత్రికి చెందిన హెమటో ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్రకుమార్ తోట తెలిపారు.

నేడు ఎల్‌పి సమావేశానికి వస్తారా?

- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఉత్కంఠ
- పార్టీ మారినట్టు ఆధారాల్లేవన్న స్పీకర్
- బిఆర్ఎస్ శాసనసభ్యులేనని చెప్పిన సిఎం
- అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు అంగీకరించారు : కెటిఆర్
- భవిష్యత్ కార్యాచరణపై కెసిఆర్ దిశానిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ఎల్‌పి, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆ పార్టీ అధినేత కెసిఆర్ అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరగనుంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు కెసిఆర్ ఇప్పటికే నందినగర్‌లోని ఇంటికి శనివారం మధ్యాహ్నమే చేరుకున్నారు. అయితే ఫిరాయింపు ఎమ్మెల్యేలపైనే ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది. బిఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ప్రకటించారు. ఇంకోవైపు ఐదుగురు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి (గద్వాల), టి ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి) పార్టీ మారినట్టు ఎలాంటి ఆధారాల్లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈనెల 17న తీర్పును వెల్లడించారు. వారిపై ఉన్న అనర్హత పిటిషన్లను కొట్టేశారు. దీంతో వారు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే పరిగణించబడతారు. మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), కాలె యాదయ్య (చేవెళ్ల), ఎం సంజయ్ కుమార్ (జగిత్యాల), దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్) అనర్హత పిటిషన్లపై త్వరలోనే తీర్పును వెల్లడించే అవకాశమున్నది. ఆ పదిమంది ఎమ్మెల్యేలు ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగే బిఆర్ఎస్ఎల్‌పి సమావేశానికి హాజరవుతారా?లేదా?అన్నది ఉత్కంఠగా మారింది. ఎందుకంటే ఇప్పుడు బంతి ఎమ్మెల్యేల కోర్టులోనే ఉన్నది. బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటూ చెప్తున్నా ఆ పార్టీ కార్యక్రమాల్లో వారు పాల్గొనడం లేదు. ఇప్పుడు బిఆర్ఎస్ఎల్‌పి సమావేశానికి హాజరు కాకుంటే పార్టీ మారినందునే రాలేదని బిఆర్ఎస్ పార్టీ ప్రచారం చేస్తుంది. దీంతో ఆ ఎమ్మెల్యేలు ఏం చేస్తారనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఆ పది మంది ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌కు చెందిన వారేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పుడు స్పీకర్ బులెటిన్ విడుదల చేసినపుడు బిఆర్ఎస్ సభ్యులుగానే పరిగణించబడుతున్నారని గుర్తు చేశారు. వారిని కలుపుకుని సంఖ్య అధారంగా ఎక్కువ సమయం కావాలంటూ హరీశ్‌రావు స్పీకర్‌ను అడుగుతారని చెప్పారు. అయితే స్పీకర్ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను కొట్టేయడాన్ని బి ఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వ్యాఖ్యానించింది. అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలు చాలా సార్లు బహిరంగంగా ప్రకటించారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఈ అంశంపై తాము న్యాయపోరాటం చేస్తామని ఆయన ప్రకటించారు.

కృష్ణా, గోదావరి జలాల హక్కులపై బిఆర్ఎస్ పోరాటం

బిఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన బిఆర్ఎస్ఎల్‌పి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తెలంగాణ భవన్‌లో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానుంది. ఇందులో పార్టీ పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొంటారు. ఈ సమావేశంలో కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశమున్నట్టు తెలిసింది. ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణపై కెసిఆర్ దిశానిర్దేశం చేయనున్నట్టు సమాచారం. రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణ కోసం పోరాటానికి సిద్ధం కావాలని భావిస్తున్నట్టు తెలిసింది. కృష్ణా, గోదావరి జలాలను



రక్షించుకోవడానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించే అవకాశమున్నది. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలు, ప్రభుత్వవ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని భావిస్తున్నది. పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి బిఆర్ఎస్ గట్టిపోటీ ఇచ్చింది. 3,511 (27.64 శాతం) సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది. అధిక స్థానాల్లో విజయం సాధించడంతో ఆ పార్టీలో జోష్ వచ్చింది. ఇదే స్ఫూర్తితో ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసే అవకాశమున్నది. పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ప్రజా సమస్యలపై పోరాటం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించనుంది.

యువకులకు మల్టీస్కిల్స్ అవసరం

- ఇండియా స్కిల్ - 2025 ముగింపు కార్యక్రమంలో మంత్రి వివేక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యువకులకు ఇండియా స్కిల్ కాంపిటేషన్ ఒక మంచి అవకాశమనీ, దీంతో మనలో ఉన్న సామర్థ్యాన్ని మెరుగు పరుచుకునే అవకాశం ఉంటుందని ఉపాధి కల్పన, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా స్కిల్-2025 ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాలు కావాలంటే స్కిల్స్ అవసరమని చెప్పారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో మల్టీ స్కిల్స్ అవసరమని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 115 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమలకు ఏ నైపుణ్యం అవసరమో దాన్ని దృష్టిలో పెట్టుకుని కోర్స్ డిజైన్ చేసుకోవాలని సూచించారు. విన్నర్స్, రన్నర్స్ కు రూ.పదివేలు, రూ.ఐదు వేల రివార్డ్ ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ పాల్గొన్నారు.

టిజిఒ ప్రధాన కార్యదర్శిగా శ్యామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గెజిటెడ్ అధికారుల (టిజిఒ) సంఘం రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శి బి శ్యామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 31న టిజిఒ ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ ఉద్యోగ విరమణ పొందుతున్నారు. దీంతో కొత్త ప్రధాన కార్యదర్శిని ఎన్నుకునే సంపూర్ణ అధికారాన్ని సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావుకు ఇస్తూ అక్టోబర్ పదో తేదీన మెదక్ జిల్లా ఏడుపాయల వద్ద జరిగిన కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. విస్తృత అభిప్రాయ సేకరణలో భాగంగా మెజార్టీ సభ్యుల అభిప్రాయం ప్రకారం శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి బి శ్యామ్‌ను ఎన్నుకున్నారు. వచ్చేనెల ఒకటో తేదీన ఆయన టిజిఒ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరిస్తారు. శ్యామ్ ప్రస్తుతం టిజిఒ అసోసియేట్ అధ్యక్షులుగా, రాష్ట్ర పన్నుల శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. టిజిఒ ప్రధాన కార్యదర్శిగా బి శ్యామ్‌ను ఎన్నుకోవడం పట్ల ఉద్యోగులు, అధికారులు హర్షం ప్రకటించారు.

టెట్ పరీక్షలను వాయిదా వేయాలి : డిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చేనెల మూడు నుంచి నిర్వహించతలపెట్టిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేయాలని డీటీఎఫ్ అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు విధుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అవకాశం లేదని పేర్కొన్నారు. వచ్చేనెల మూడు నుంచి టెట్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయనీ, ఉపాధ్యాయుల్లో ఆందోళన ఉందని వివరించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే పరీక్షలుండడంతో టీచర్లు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఈ పరీక్షలను కొన్ని రోజులపాటు వాయిదా వేసి ఉపాధ్యాయులకు సిద్ధమయ్యేందుకు సముచిత సమయం ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ అధికారులను వారు కోరారు.

విబి - జిఆర్ఎంజి బిల్లుకు నిరసనగా 22న ఆందోళనలు

- కెవిపిఎస్, టిజిఎస్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ బిల్లును రద్దు చేయాలని ఈ నెల 22న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), తెలంగాణ గిరిజన సంఘం పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆ సంఘాల రాష్ట్ర కార్యదర్శులు టి స్కైలాబ్‌బాబు, ఆర్ శ్రీరాంనాయక్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి బి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్య వల్ల అత్యంత పేదలుగా ఉన్న దళితులు, గిరిజనులు ఉపాధి అవకాశాలను కోల్పోతారనీ, పేదల ఉపాధికి తూట్లు పొడిచే చర్య అని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పాత చట్టాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిజాం నాటి చెరువుకు ప్రాణం పోసిన హైడ్రా

- పాతబస్తీకే మణిహారంగా బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు
- ప్రారంభానికి సన్నాహం
- అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని పాతబస్తీలో నిజాం కాలం నాటి చారిత్రక చెరువుకు హైడ్రా ప్రాణం పోసింది. కబ్జాలను తొలగించి ఊపిరందించింది. ఆక్రమణలతో ఆనవాళ్లే కోల్పోయిన చెరువును బతికించింది. చరిత్రను తవ్వి తీసిన మాదిరి చెరువును రూపొందించి చారిత్రక వైభవాన్ని హైడ్రా చాటింది. పాతబస్తీకే మణిహారంగా బమ్ - రుక్న్ - ఉద్ - దౌలా చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. జనవరిలో ఈ చెరువును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ శనివారం బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

పరిశీలించారు. కాలగర్భంలో కలిసిపోయిందనుకున్న చరిత్రకు ప్రాణం పోస్తున్నాం, ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ అధికారులను ఆదేశించారు. చెరువుకు స్థానికులు సులభంగా చేరుకునేలా రహదారులతోపాటు ప్రవేశ ద్వారాలుండాలని సూచించారు. చెరువు చుట్టూ బండ్‌పై వాకింగ్ ట్రాక్‌లు, లోపలి వైపు ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. చిన్నారులు ఆడుకునేందుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న ప్లే ఏరియాలను పరిశీలించారు. వృద్ధులు సేదదీరేలా అక్కడ గజబోలు నిర్మాణాలు నలువైపులా ఉండేలా చూడాలన్నారు. పార్కులు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాట్లను పరిశీలించారు.

విహార కేంద్రంగా తీర్చిదిద్దాలి

పాతబస్తీలో నేషనల్ పోలీస్ అకాడమీకి చేరువలో అభివృద్ధి చేస్తున్న బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును విహార కేంద్రంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔషధ గుణాలున్న వృక్ష జాతితో పాటు, మొక్కలను చెరువు చుట్టూ నాటాలని సూచించారు. నిజాం కాలంలో చెరువు నిర్మాణంలో వాడిన రాతిని వినియోగించి కట్టడాన్ని పటిష్టం చేయాలన్నారు. ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్‌లు విశాలంగా ఉండేలా చేపట్టిన నిర్మాణాలను చూశారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్ ఇలా పది కిలోమీటర్ల మేర చెరువుకు వర్షం నీరు వచ్చేలా ఇన్‌లెట్లు నిర్మించాలని, ఈ ప్రాంతంలో వరద కష్టాలకు ఈ చెరువు చెక్‌పెట్టేలా చూడాలని సూచించారు. సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నారు.

శిల్పారామంలో హస్తకళామేళా ప్రారంభం

- అందుబాటులో వివిధ రాష్ట్రాల చేనేత హస్త కళా ఉత్పత్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా మాదాపూర్‌లోని శిల్పారామంలో అల్ ఇండియా క్రాఫ్ట్ మేళా శనివారం ప్రారంభమైంది. డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండ్లూమ్స్, మినిస్ట్రీ అఫ్ టెక్స్‌టైల్స్, గవర్నమెంట్ అఫ్ ఇండియా, నేషనల్ జ్యూట్ బోర్డు, శిల్పారామం సంయుక్త నిర్వహణలో అంతర్జాతీయ హస్తకళా ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి చేనేత హస్త కళా ఉత్పత్తులు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాజస్థాన్ కోటా చీరలు, కోల్‌కతా జాంధానీ, తస్సార్, బెంగాల్ కాటన్, కాంత వర్క్, ఆంధ్రప్రదేశ్ కలంకారీ, మంగళగిరి, వెంకటగిరి, ఉత్తరప్రదేశ్ బనారస్, మస్లిన్, గుజరాత్ బాందినీ, రాజకోట, అజ్రాక్ మొదలైన చీరలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అలాగే, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా బెంగళూరుకు చెందిన హరిప్రియ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన చేసింది. గణేశా స్తుతి, అల్లరిపు, శివాష్టకం, జగన్మోహన్, వీరిందవని వేణు, శివ పదం, శ్రీ చక్ర రాజా మొదలైన అంశాలను హరిప్రియ, అనూష, హేమ వర్షిణి, ప్రవల్లిక, నీరజ, కిరణశ్రీ, శ్రీలేఖ, జ్ఞాన సద్యుతి ప్రదర్శించారు.

కార్పొరేట్ సంస్థలకు బొగ్గుబావులా?

- వాటిని సింగరేణికి కేటాయించాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం బొగ్గుబావులను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలనే ఆలోచన విరమించుకోవాలనీ, వాటిని సింగరేణికే కేటాయించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేటీకరణ విధానంలో భాగంగా బొగ్గు బావులను వేలంపాట ద్వారా కేంద్రం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కోల్ ఇండియా, సింగరేణిలోని బొగ్గు బావులను టెండర్ల ద్వారా కేటాయించాలని నిర్ణయించిందని గుర్తు చేశారు. వేలంపాటలో పాల్గొంటేనే గనులు కేటాయిస్తామని చెబుతోందనీ, ఈ విధానాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. టెండర్లను రద్దు చేసి సింగరేణికి నేరుగా బొగ్గు బావులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణలో భాగమే ఈ టెండర్లనీ, వాటికి వ్యతిరేకంగా సింగరేణి కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే బొగ్గు రంగంలో ప్రయివేటీకరణ యధేచ్ఛగా అమలవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కోయగూడెం ఓసీ బ్లాకును అరబిందోకు కేటాయించి మూడేండ్లయినా పని చేపట్టలేదని పేర్కొన్నారు. సత్తుపల్లి ఓసీని అవంతిక కాంట్రాక్టర్‌కు అప్పగించారనీ, రెండేండ్లయినా పని ప్రారంభం చేయలేదని తెలిపారు. వీటిని రద్దు చేసి సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం మణుగూరు ఓసీ3 ఎక్స్‌టెన్షన్ బ్లాకును టెండర్‌లో పెట్టారని పేర్కొన్నారు. ఇది ప్రయివేటుకు వెళ్తే ప్రమాదముందని తెలిపారు. ఇల్లందు, కొత్తగూడెం ఓపెన్ కాస్టు కూడా గతంలో ప్రయివేట్ వారికి ఇవ్వడంతో ఆయా ఏరియాల్లో రానున్న కొద్దికాలంలో బొగ్గు బావులు మూతపడే ప్రమాదం ఉందని ఆరోపించారు. వీటన్నింటినీ పరిశీలిస్తే టెండర్ల విధానం వల్ల సింగరేణికి నష్టం జరిగిందని తెలిపారు. అంతిమంగా ప్రయివేటీకరణకు దారి తీస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలోని బొగ్గు నిల్వలన్నీ గుర్తించి, వాటిని సింగరేణి హక్కుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

గాంధీ పేరు చెబితేనే మోడీ, అమిత్ షా గుండెల్లో రైళ్లు

- అందుకే ఉపాధి హామీ చట్టానికి పేరు తొలగించారు
- టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్
- ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీ పేరు చెబితేనే మోడీ, అమిత్ షా గుండెల్లో రైళ్లు పరుగెతుతున్నాయని, అందుకే ఆయన పేరును మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నుంచి తొలగించారని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. వారు నిజమైన గాడ్సే వారసులు కాబట్టే ఇలాంటి దుర్మార్గమైన ఆలోచన చేశారన్నారు. 'మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ' నుంచి గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్ ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం ఎదుట టీపీసీసీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులతోపాటు కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. గాంధీ పేరు చెప్పగానే ప్రజలకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ గుర్తుకు వస్తారని, రాజకీయంగా వారిని ఎదుర్కోలేక.. ఉపాధి హామీ చట్టం నుంచి గాంధీ పేరును తొలగించారని అన్నారు. ఇది దేశప్రతిష్టకు భంగం కలిగించే అంశమన్నారు. 2014లో ఈ చట్టానికి నిధులు కోత పెట్టారని, ఇప్పుడు గాంధీ పేరును తొలగించడంతోపాటు ఈ చట్టం భారం రాష్ట్రాలపై మోపుతూ క్రమంగా దాన్ని తొలగించే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. సంఖ్యాబలం ఉందని పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదించారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ పేరును మారుస్తామని చెప్పారు. గాంధీ పేరు తొలగింపు బిల్లుపై సభలో రాహుల్, ఖర్గే ఎంత వాదించినా అధికార పక్షం వ్యతిరేకించి.. దాన్ని ఆమోదించుకున్నారంటే వారి



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంఎల్ఎలు, తదితరులు

మనసుల్లో గాంధీపై ఎంత విద్వేషం ఉందో తెలుస్తున్నదన్నారు. ఎన్ని తంత్రాలు చేసినా జాతిపిత మహాత్మా గాంధీ పేరును ప్రజల హృదయాల్లో నుంచి తొలగించలేరన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక సిబిఐ, ఇడి కేసులు బనాయిస్తే కోర్టు మొట్టికాయలు వేసిందని, అయినా రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ ముందుకు సాగుతున్నారని విమర్శించారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పేదల కడుపు నింపేందుకు తెచ్చిన ఉపాధి హామీ పట్టం ప్రపంచంలో ఎక్కుడా లేదని, దాన్ని నిర్వీర్యం చేసి ఎత్తేసేందుకు కేంద్ర ప్రభుత్వం దురాలోచనలు చేయడం సరికాదన్నారు. దీనిపై శాంతియుత పోరాటాలు కొనసాగిస్తామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో పేదల ఉపాధిని దెబ్బతీయడానికి, గ్రామీణ వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎమ్మెల్యేలు శ్రీగణేష్, నవీన్ యాదవ్, మాజీ ఎంపి హన్మంతరావు, నాయకులు ఫిరోజ్‌ఖాన్, కోదండరెడ్డి, ఆదం సంతోష్ కుమార్, రోహిణిరెడ్డి, త్రికాల మనోజ్‌కుమార్, మల్లికార్జున్, సంతోష్ యాదవ్, కె.కుమార్‌రెడ్డి, బొజ్జు వెద్మా, సంపత్, ఉమార్, దీపక్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

కెసిజి కాలేజీ విద్యార్థినికి ఐఇటి స్కాలర్‌షిప్

హైదరాబాద్ :కెసిజి కాలేజ్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థిని రితికా ఎస్‌కెకు ప్రముఖ ప్రొఫెషనల్ ఇంజినీరింగ్ సంస్థలలో ఒకటైన ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఐఇటి) స్కాలర్‌షిప్ దక్కింది. 9వ ఐఇటి ఇండియా స్కాలర్‌షిప్ అవార్డుకు రితికా జాతీయ విజేతగా ఎంపికయ్యిందని ఆ సంస్థ పేర్కొంది. ఇందులో అండర్‌గ్రాడ్యుయేట్ ఇంజనీర్లకు భారత్‌లో రూ.మూడు లక్షల స్కాలర్‌షిప్‌తో పాటు ఉచిత ఐఇటి సభ్యత్వం లభించనుంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఎపికి చెందిన ఖుషి మల్హోత్రా సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు.

అబద్ధాలు ఆడటంలో రేవంత్ రెడ్డికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయాల్లో అబద్ధాలు ఆడటంలో సిఎం రేవంత్‌రెడ్డికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సంగారెడ్డి, ఆందోల్ నియోజకవర్గాలలో గెలిచిన బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో హరీశ్‌రావు ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కేసులు పెట్టినా, డబ్బులు పంచినా, గుండాయిజం చేసినా అద్భుతంగా ఎదిరించి గెలిచిన సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎప్పుడైనా లోకల్ బాడీ ఎన్నికల్లో అధికార పార్టీ 90శాతం గెలిస్తే.. పది శాతం ప్రతిపక్ష పార్టీలు గెలుస్తాయని అన్నారు. కానీ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 40 శాతం అంటే 4వేలకు పైగా సర్పంచ్ స్థానాలను గెలిచిందని తెలిపారు. బీఆర్ఎస్ తరపున గెలిచిన సర్పంచులను కూడా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఖాతాలో వేసుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 50 శాతంలోపే సర్పంచుల స్థానాలు గెలిచిందని, కానీ ముఖ్యమంత్రి మాత్రం 66శాతం గెలిచామని బుకాయిస్తున్నారని విమర్శించారు.

సెక్యూరిటీ గార్డులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు కొనసాగింపు ఉత్తర్వులను ఏడాదికి ఒకసారి ఇవ్వాలనీ, పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల సాంబయ్య, యాటల సోమన్న శనివారం హైదరాబాద్‌లోని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో 192 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన సుమారు 1,200మంది సెక్యూరిటీ గార్డులుగా 30 ఏండ్లనుంచి మార్కెట్ యార్డులు, చెక్‌పోస్టులలో, కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఆర్థిక సంవత్సరం విధులు కొనసాగించుటకు ఏడాది మొత్తానికి అనుమతించేవారనీ, ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో వేతనాలకు నిధులు కేటాయించినప్పటికీ ఆర్థిక శాఖ అనుమతి లేదని కొనసాగించేందుకు నెలనెల అనుమతి ఇవ్వటం వల్ల ఉద్యోగ భద్రతలో ఆందోళనగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఒకేసారి కొనసాగింపు అనుమతిని ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తేయాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు టిఎస్‌యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నల్లగొండ, ఖమ్మం జిల్లా కలెక్టర్లు చేసిన ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలనీ, వారిని విధుల్లోకి తీసుకునేలా తగు ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సెక్రటరీ వినోద్‌కుమార్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ కలిసి వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లాలో ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత రవాణాలో జరిగిన పొరపాటు వల్ల ఒక బ్యాలెట్ బండిల్ బయట దొరకడం అనే సంఘటనపై పది మంది పిఒలను సస్పెండ్ చేయడం తగదని తెలిపారు. సరైన బాధ్యులను గుర్తించకుండా అందరినీ శిక్షించడం ద్వారా ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల శ్రమను గుర్తించడంలో ఆ జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యం చేశారనీ, ఎన్నికల కమిషన్ ఇచ్చిన విరామం లేని షెడ్యూల్‌ను విజయవంతంగా ముగించడంలో టీచర్ల పాత్ర కీలకంగా ఉందని వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు భిన్నంగా తక్కువ రెమ్యూనరేషన్ చెల్లించినప్పటికీ ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేశారనీ, దీన్ని గుర్తించాలని కోరారు. ఖమ్మం జిల్లాలో కలెక్టర్ సస్పెండ్ చేసిన ఆర్ఒ సస్పెన్షన్‌ను కూడా ఎత్తేయాలని సూచించారు.



కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్న ఓడిపోయిన సర్పంచ్

అభ్యర్థి ఓటు వేయలేదని రోడ్డు దిగ్బంధం

- ఓడిపోయిన అభ్యర్థి కుటుంబీకులు దాడికి పోలీసులపైయత్నం
- కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం చిన్న బుగ్గారం గ్రామంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి రోడ్డుకు అడ్డంగా ఎడ్లబండిని దిగ్బంధించాడు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులపై ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి కుటుంబ సభ్యులు దాడికి యత్నించారు. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి.. గ్రామస్తులు తనకు ఓటు వేయలేదన్న కోపంతో శనివారం గ్రామ ప్రధాన రహదారిపై ఎడ్ల బండిని అడ్డంగా పెట్టి రాకపోకలను నిలిపేశాడు. దీంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో గ్రామస్తులకు, సదరు వ్యక్తికి వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్ఐ ఇమ్రాన్‌ఖాన్ పోలీసు సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిపై అడ్డుగా ఉన్న ఎడ్ల బండిని తొలగించాలని సదరు వ్యక్తికి సూచించినా వినలేదు. ఇదే సమయంలో పోలీసులకు, ఓడిపోయిన అభ్యర్థి కుటుంబీకులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తోపులాటలో ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఘటన అనంతరం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, శాంతిభద్రతలకు భంగం కలగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో గస్తీ పెంచిన పోలీసులు, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మహాత్మా ఇలస్ట్రేటెడ్ పుస్తకావిష్కరణలో ప్రముఖులు

'మహాత్మా ఇలస్ట్రేటెడ్'పుస్తకావిష్కరణ

- రాబోయే తరాలకు ప్రేరణ
- శంకర్ పామర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలో జరుగుతోన్న హైడ్.ఆర్ట్-2025లో ప్రఖ్యాత కార్టూనిస్ట్ శంకర్ పామర్తి రూపొందించిన మహాత్మా ఇలస్ట్రేటెడ్ పుస్తకావిష్కరణ జరిగింది. ఈ గ్రంథం బాపూజీ జీవన ప్రయాణాన్ని, ఆయన తీరును కొత్త తరానికి పరిచయం చేసే ఒక దృశ్య కావ్యంగా ఉంటుందని శంకర్ పామర్తి తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ చేసిన అపార త్యాగాలకు ఇది తన నివాళిగా నిలుస్తుందన్నారు. యువతను మాత్రమే కాకుండా రాబోయే తరాలను కూడా ప్రేరేపించాలన్న లక్ష్యంతో దీన్ని రూపొందించానన్నారు. రెండో రోజు జరిగిన ప్రదర్శనలో ఏర్పాటు చేసిన మాస్టర్స్ ఆఫ్ ఇండియా గ్యాలరీలో ఎంఎఫ్ హుస్సేన్, ఎస్‌హెచ్ రజా వంటి దిగ్గజాల కళాఖండాలను వీక్షించేందుకు కళాభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్.ఆర్ట్ క్యూరేటర్ అన్నపూర్ణ మడిపడిగ, హైడ్.ఆర్ట్ వ్యవస్థాపకుడు హసన్, నవనామి ప్రాజెక్ట్స్ ఎండి వెంకట్ నవీన్ గద్దె, డైరెక్టర్ కృష్ణకాంత్ కోటగిరి తదితరులు పాల్గొన్నారు.